

19 నుంచి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఎంపికలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఖేళో ఇండియా యూత్ గేమ్స్ ఎంపికలు ఈ నెల 19 నుంచి 31 వరకు చెన్నయ్ నగరంలో నిర్వహిస్తున్నట్లు డిఎస్‌డిఒ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రా తరుపున వాలీబాల్ క్రీడలో పాల్గొనదలచిన వారు అర్హులని పేర్కొన్నారు. జట్టులో చోటు కోసం ఈనెల 11న వాలీబాల్ బాలురు జట్లు ఎంపిక విజయవాడలోని ఐజిఎంసి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వాలీబాల్ క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, మెట్రిక్యులేషన్ ధ్రువపత్రం, జనన ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో హాజరుకావాలన్నారు.

ఏం జరగబోతోంది?

జిల్లాకు సంబంధించి తొలుత ఎచ్చెర్ల మార్పుపై అధిష్టానం వద్ద చర్చ జరిగిన నేపథ్యంలో అందరి దృష్టి ఆ నియోజకవర్గంపైనే పడింది. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను మార్చి ఆ స్థానంలో విజయనగరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును నియమిస్తారంటూ ఇప్పటివరకు ప్రచారం జరిగింది. అధిష్టానం నిర్ణయం ఎలా ఉండబోతుందోనని ఇప్పటివరకు అంతా ఎదురు చూశారు. వైసిపి అధిష్టానం అకస్మాత్తుగా ఈ నెల ఎనిమిదో తేదీన విజయనగరం ఎంపీగా ఉన్న బెల్లాన చంద్రశేఖర్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జి నియమించనుందన్న వార్తతో మజ్జి శ్రీను మద్దతుదారులు అంతా కంగుతిన్నారు. అధిష్టానం నిర్ణయంపై అటు ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ అనుకూల, వ్యతిరేక వర్గాలు రెండూ షాక్‌కు గురయ్యాయి.

ఎచ్చెర్ల వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా 'బెల్లాన'!

వైసిపి అధిష్టానం ప్రతిపాదన షాక్‌కు గురైన చిన్న శ్రీను మద్దతుదారులు


వ్యతిరేకిస్తున్న కిరణ్ అనుకూల, వ్యతిరేక వర్గాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రాబోవు ఎన్నికల్లో ఎచ్చెర్ల నియోజకవర్గంలో అభ్యర్థిని మార్చనున్నారన్న ఊహాగానాలు నిజం చేసేలా వైసిపి అధిష్టానం ఈ నెల ఎనిమిదో తేదీన ఒక నిర్ణయం తీసుకున్నట్లుగా నియోజకవర్గంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. విజయనగరం జిల్లా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించనున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వ్యతిరేకవర్గం భగ్గుమంది.



కిరణ్‌కుమార్



చంద్రశేఖర్

పార్టీ నిర్ణయాన్ని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే గొర్లె అనుకూలవర్గం పార్టీ పెద్దలను కలిసి ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. జి.సిగడాం మండలం వాంద్రంగిలో బుధవారం సమావేశమై మజ్జి శ్రీను, స్థానికంగా ఉన్న వారికి టిక్కెట్ ఇవ్వాలనే డిమాండ్‌ను వినిపించారు.

సుముఖంగా లేని చిన్న శ్రీను

ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను వ్యతిరేకిస్తున్న వారంతా గత మూడేళ్లుగా మజ్జి శ్రీనును ఇక్కడి నుంచి పోటీ చేయాలని కోరుతున్నారు. గొర్లె కిరణ్‌కుమార్ ఎమ్మెల్యే మళ్లీ అభ్యర్థి అయితే ఎట్టి పరిస్థితుల్లో తాము పని చేయబోమని ఒకట్రెండు సందర్భాల్లో బహిరంగంగానే ప్రకటించారు. ఎచ్చెర్లకు మజ్జి శ్రీనుకే బాధ్యతలు అప్పగిస్తుందని అంతా ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గంలో ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు. పార్టీ మాత్రం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను నియమించడంతో వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఎచ్చెర్లలో కొంత కేడర్ మజ్జి శ్రీనును కోరుకుంటున్నా అయన మాత్రం ఇక్కడి నుంచి పోటీకి సుముఖంగా లేరని తెలుస్తోంది. పార్టీలో నెలకొన్న అసమ్మతి, గ్రూపుల పోరు నడుమ పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తిగా చూపలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే విజయనగరం ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమయినట్లు చర్చనడుస్తోంది.

తగువు తీర్చడానికి వచ్చి ...

ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపిలో అసమ్మతి పోరు పార్టీకి తలనొప్పిగా మారిన నేపథ్యంలో అక్కడ పార్టీ పరిస్థితిని చక్కదిద్దేందుకు ఈ ఏడాది అక్టోబరులో ఎంపీ బెల్లానకు అధిష్టానం బాధ్యతలను అప్పగించింది. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను చీపురుపల్లిలోని తన క్యాంప్ కార్యాలయానికి మండలాల వారిగా ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం నాయకులను పిలిచి మాట్లాటారు. ఎంపీ చంద్రశేఖర్ ఆహ్వానాన్ని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు మినహా మిగిలిన అసమ్మతి నాయకులు తిరస్కరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అసమ్మతి నాయకులంతా రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎమ్మెల్యే కిరణ్‌కు టిక్కెట్ ఇస్తే పార్టీకి పనిచేయలేమని సైతం చెప్పేశారు. అదే సమయంలో ఎంపీ బెల్లాన ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కొంత మేర ప్రయత్నాలు జరిపారని అప్పట్లో గుసగుసలు వినిపించాయి. ఇప్పుడు అవే నిజం కావడంతో తగవు తీర్చడానికి వచ్చి తిష్ఠ వేశారంటూ గొర్లె అనుకూలవర్గం ఆడిపోసుకుంటోంది.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

ఎంపీ రామ్మోహన్ నాయుడు



మాజీ సైనికులతో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ రక్షణ రంగమైన త్రివిధ దళాల్లో విధులు నిర్వర్తించి, దేశ సరిహద్దులను అనునిత్యం కాపాడిన మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ మేరకు తనవంతుగా విశ్రాంత సైనికుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. నగరంలోని పెద్దరెల్లి వీధిలో ఉన్న విశ్రాంత సైనికుల జిల్లా సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం భవనం ఆధునికీకరణకు ఎంపీ ల్యాండ్స్ నుంచి నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజను ఆదేశించారు. అలాగే నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేషుతో ఫోన్లో మాట్లాడారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సైనిక సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ ఈశ్వరరావు, అధ్యక్షుడు పూర్ణచంద్రరావులు హాజరై తమ సమస్యలను వివరించారు. మాజీ సైనికులు కోరిన వెంటనే భవనం ఆధునికీకరణకు నిధులు కేటాయించిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశం మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, అధ్యక్షులు, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ జునైద్ అహ్మద్ మౌలానా సూచనపై ఎచ్చెర్లలోని టిటిడిసిలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు వినియోగదారుల హక్కులు, చట్టాలపై బుధవారం న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న అభ్యర్థులందరూ వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తప్పనిసరిగా కొన్న వస్తువుకి రసీదు తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వి.రమణ, టిటిడిసి ఇన్‌ఛార్జిలు వరాహ నరసింహులు, కృష్ణారావు, ట్రైనర్ సింహాద్రి నాయుడు, నాగమణి, ప్రభావతి, సూర్యప్రకాశ్‌రెడ్డి, ప్రియాపాల్, రామ్మోహన్ పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం

పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని, యజమానులు శిక్షకు గురవుతారని, చిన్న పిల్లల భవిష్యత్‌కు చదువు మాత్రమే మార్గం చూపుతుందని, పిల్లలను బడిలో చేర్పించాలని ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా చిలకపాలెంలో రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ ఆఫ్ చైల్డ్ లేబర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాపుల యజమానులు చిన్నపిల్లలను పనిలో పెట్టుకున్నారా? అనే విషయంపై ఆరాతీశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వి.రమణ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు కొండలరావు, ఆర్‌వి శ్రీనివాసరావు, ఎన్‌జిఒలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలి

రైతులను కోరిన సబ్ కలెక్టర్ నూరుల్ కమర్



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి- టెక్కలి

మూలపేట పోర్టు నిర్మాణం నేపథ్యంలో నిర్మాణం చేపట్టనున్న రైల్వే లైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంతబొమ్మాళి మండలం పోతునాయుడుపేట, యామాలపేట, కూర్మనాథపురం గ్రామాలకు చెందిన రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోర్టు నిర్మాణం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. రవాణా సౌకర్యం నిమిత్తం రైల్వే లైన్ నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. కూర్మనాథపురానికి చెందిన 49 మంది రైతుల వద్ద నుంచి 6.94 సెంట్లు, పోతునాయుడుపేటకు చెందిన 32 మంది రైతుల వద్ద నుంచి 35 ఎకరాలు, యామాలపేటకు చెందిన 35 మంది రైతుల నుంచి 6.38 సెంట్లు చొప్పున స్థలాన్ని సేకరించనున్నామని తెలిపారు. నౌపడ కూడలి నుంచి రైల్వే లైన్ నిర్మాణం నేపథ్యంలో ప్రభుత్వం అందించే సహాయాన్ని వివరించారు. అనంతరం రైతుల అభిప్రాయాలను సేకరించారు.

రైతులు మాట్లాడుతూ ఏటా ఈ భూములపైనే తమ కుటుంబాలు పోషించుకున్నామని, అటువంటి భూమిని రైల్వేలైన్ నిర్మాణం నేపథ్యంలో సేకరించడం వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు పడతామని సబ్ కలెక్టర్ ముందు తమ ఆవేదనను వెల్లబుచ్చారు. అభివృద్ధికి తాము వ్యతిరేకులం కాదని స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, మిగిలిన గ్రామాల రైతులకు ఇచ్చే విధంగానే ఎకరాకు రూ.45 నుంచి 40 లక్షల వరకు నష్టపరిహారం అందించాలని కోరారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సబ్ కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సంతబొమ్మాళి తహశీల్దార్ జాలారి చలమయ్య, రైతులు పిలక రవికుమార్‌రెడ్డి, దల్లి ప్రసాద్‌రెడ్డి, గిన్ని ప్రకాష్, కోట అప్పలరెడ్డి, శీరపు చిరంజీవి, దల్లి లచ్చయ్య పాల్గొన్నారు.

రైతులు అసహనం

పోర్టు నిర్మాణం నేపథ్యంలో రైల్వేలైన్ నిర్మాణానికి భూమి సేకరించనున్న రైతుల అభిప్రాయాలను తెలుసుకునే నిమిత్తం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేమని చెప్పి సాయంత్రం 5 గంటల వరకు ప్రారంభించకపోవడంతో రైతులు చిరాకు పడ్డారు. ఒకానొక దశలో సమావేశాన్ని బహిష్కరించేందుకు సిద్ధమయ్యారు. రైతులు సయమనం పాటించాలని కార్యాలయ అధికారులు కోరారు. పండగ ముందు ధాన్యం అమ్మకాలు చేపట్టాలని, సమావేశమని పిలిచి ఆలస్యం చేయడం సబబుకాదని వాపోయారు.

సిపిఐ జిల్లా కార్యదర్శిగా వెంకటరమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



వెంకటరమణ

సిపిఐ జిల్లా కార్యదర్శిగా చాపర వెంకటరమణను సిపిఐ జిల్లా సమితి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్‌లో బుధవారం సిపిఐ జిల్లా కార్యవర్గ, సమితి సమావేశం బుధ వారం నిర్వహించారు. ఈ సమా వేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శిగా వెంకటరమణతో పాటు జిల్లా కార్యవర్గంలోకి ఎఐవైఎఫ్ నుంచి కె.శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య నుంచి అరెలమ్మలను ఎన్నుకున్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గత 15 రోజులుగా నిరవధిక సమ్మెలో భాగంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన అనేక రకాలుగా నిరసన తెలుపుతూ ప్రభుత్వానికి తమ ఆవేదనను వెల్లడించారు. వివిధ రూపాల్లో నిరసన తెలిపిన మున్సిపల్ కార్మికులకు ఎట్టకేలకు ప్రభుత్వం దిగి వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చింది. బుధవారం విజయవాడలో జరిగిన మంత్రుల కమిటీ చర్చల్లో యూనియన్ నాయకులు తమ డిమాండ్లను విన్నవించారు. ఈ మేరకు ప్రభుత్వం సమ్మె కాలానికి వేతనం చెల్లించడంతో పాటు ప్రధాన డిమాండ్లకు సంబంధించిన జిఒలు విడుదల చేస్తామని హామీనిచ్చారు. ఆ హామీ మేరకు చర్చలు ఫలప్రదమైనట్లు యూనియన్ నాయకులు వెల్లడించారు. అందులో భాగంగా బుధవారం రాత్రి సమ్మె విరమిస్తూ... యథావిధిగా గురువారం 5 గంటల నుంచి విధులకు హాజరవుతున్నట్లు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బలరాం, ఉపాధ్యక్షులు ఆరుగుల్ల గణేష్ వెల్లడించారు. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమ్మన్నాయుడు, తేజేశ్వరరావులు హర్షం వ్యక్తం చేశారు. సమ్మె సమయంలో సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలో పోలింగ్ కేంద్రాలను బుధవారం పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్ పరిశీలించారు. గరుడభద్ర, అక్కుపల్లి, వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు తదితర పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. ఓటర్లకు అవసరమైన సదుపాయాలు ఉన్నయో లేదో అడిగి తెలుసుకున్నారు. వికలాంగ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రావడానికి వీలుగా అవసరమైన ర్యాంపు లేకపోతే ర్యాంపులు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ బి.అప్పలస్వామికి సూచించారు. దీనికి సంబంధించిన పూర్తి నివేదికను ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఆర్‌డిఒ భరత్ నాయక్ తెలిపారు.

రేపు జిల్లాస్థాయి 5కె రన్

పలాస: పలాస మండలం నీలావతి ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం 6 గంటలకు 5కె రన్ నిర్వహిస్తున్నట్లు ఉద్దాన ప్రాంత విద్యా అభివృద్ధి వేదిక గౌరవ అధ్యక్షులు బి.ఓంకార్ ఒక ప్రకటనలో తెలిపారు. మర్రిపాడు కూడలి నుంచి బొడ్డపాడు మీదగా నీలావతి యువివి గ్రంథాలయం వరకు 5కె రన్ ఉంటుందన్నారు. మర్రిపాడు కూడలి వద్దకు ఉదయం 6గంలకు 5కె రన్ పాల్గొనే అభ్యర్థులు చేరుకోవాలన్నారు. అభ్యర్థుల అనారోగ్యంతో, ఇతరేతర సమస్యలున్నా పోటీలో పాల్గొనరాదని, దీనికి యువివి ఎటువంటి బాధ్యత వహించదని అన్నారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు అందజేస్తామని చెప్పారు.9963708029, 9908484837 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

ఎస్మాకు భయపడేది లేదు



కొత్తూరు : పొర్లుదండాలు పెడుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

ప్రభుత్వం ఉపయోగించిన ఎస్మాకు అంగన్వాడీలు భయపడేదిలేదని, అంగన్వాడీ కోర్కెలు న్యాయసమ్మతమైనవని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద జ్యోతిభాపూలే పార్కు సమీపాన ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యాన చేపట్టిన 24 గంటలు నిరాహార దీక్షలు బుధవారానికి ఐదో రోజుకు చేరాయి. ముందు శిబిరాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ అంగన్వాడీలు 30 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండివైఖరి వీడకపోవడం దారుణమన్నారు. అంగన్వాడీల సంక్షేమానికి గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పైగా అంగన్వాడీలపై బెదిరింపులు, నోటీసులు ఇవ్వడం మానుకొని తక్షణమే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రాధాన్యత ఉన్న ఐసిడిఎస్ సంస్థకు నిధులు పెంచి అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలకు, అరెస్టులకు, కేసులకు అంగన్వాడీలు భయపడే వారు కాదని, ఇటువంటి ప్రభుత్వాలను అనేకం చూశారని వివరించారు. ఆమరణ దీక్షకైనా వెనకాడేది లేదని స్పష్టం చేశారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ అమలు చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలు అనేక సేవలు అందిస్తున్న అంగన్వాడీలకు ప్రజలు అండగా ఉండాలని కోరారు. ఈ దీక్షకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, బి.హరీష్, ఎ.సంతు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ దీక్షలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుదర్శనం, బి.ఆదిలక్ష్మి, టి.రాజేశ్వరి, ఇ.అప్పలనరసమ్మ, కె.నాగపద్మ, వై.లీలారత్నం, ఎన్.కృష్ణభారతి, పి.భారతి, సిహెచ్.అరుణ, చిట్టితల్లి పాల్గొన్నారు.

కొత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.లక్ష్మి, హేమలత, జలజాక్షి, ధనలక్ష్మి, లక్ష్మి, అమ్మాయమ్మ, బోడెమ్మ, అరుణ, భవాని, మధురవేణి, నిర్మల, జ్యోతి, ఉత్తర రమణమ్మ, లక్ష్మి, సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్, నిమ్మక అప్పన్న పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు.

ఇచ్ఛాపురం బస్టాండ్ చేపట్టిన సమ్మెలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేతులు ఎత్తి మొక్కుతూ నిరసన తెలిపారు.

కోటబొమ్మాళి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, సిఐటియు నాయకులు దుంపల సుదర్శన్ పాల్గొన్నారు.

పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెలో యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, నాగరత్నం, రమణమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

పలాస-కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద చేపట్టిన సమ్మెలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మంజుల, బి.సునీత, కె.జ్యోతి, బి.చామంతి, బి.నిర్మల, జయలక్ష్మి, నారాయణి, ఆర్.భవాని పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న హరీష్

మందస ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద చేపట్టిన సమ్మెలో సిఐటియు నాయకులు దిలీప్‌కుమార్, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎన్.హైమావతి, జాన్సీ, కె.ప్రభావతి, పద్మ, ఎస్.గీత, వి.హేమలత పాల్గొన్నారు.

ఆమదాలవలస ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి, మొదలవలస లత, పి.లక్ష్మి, మాధవి, కనకం పాల్గొన్నారు.

టెక్కలి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, రమణమ్మ, సుజాత, పద్మావతి, రమా, ఇందిర, అరుణ, ఉష పాల్గొన్నారు.



మందస : సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు



ఇచ్ఛాపురం : చేతులు ఎత్తి దండం పెడుతున్న అంగన్వాడీలు


దీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కొనసాగుతున్న సమ్మె

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సమగ్ర శిక్ష, కెజిబివి ఉద్యోగులు గడచిన 22 రోజులుగా సమ్మె చేస్తుంటే... బ్రిటిష్ పాలకుల తరహాలో ఉద్యోగుల మధ్య అనైక్యతను సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి అధ్యక్షులు పి.మురళీకృష్ణ ఆరోపించారు. నగరంలోని జ్యోతిరావు పులే పార్కు వద్ద చేపట్టిన ధర్నా శిబిరంలో బుధవారం పాల్గొని మాట్లాడారు. సమ్మె చేస్తున్న ఉద్యోగుల్లో కొన్ని విభాగాలకు వేతనాలు పెంచుతూ వర్గాలుగా విభజించడం తగదన్నారు. న్యాయసమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెఎసి ప్రధాన కార్యదర్శి పి.తవిటినాయుడు, డి.శ్రీనివాసరావు గిరిధర్, గౌరీశంకర్, ఉషారాణి, అరుణకుమారి, జ్యోతి పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక జెసిఐ సంస్థ, ఎఆర్ఎస్ గ్యాస్ట్రో లివర్ క్లినిక్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గ్యాస్ట్రో లివర్ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. విజె ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అరుదైన ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. డాక్టరు టివి. ప్రదీప్ ఆధ్వర్యంలో ఉచిత లివర్ హెల్త్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 160మందికి పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ ఎస్ఐ గోవిందరావు మాట్లాడుతూ అరుదైన లివర్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. రోగులకు అవసరమైన పరీక్షలు, స్కానింగ్‌లు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో జెసిఐ అధ్యక్షుడు షణ్ముఖరావు, సెక్రటరీ పవన్ కుమార్, కోశాధికారి ప్రేమసాయి, ప్రాజెక్ట్ చైర్మన్ నవీన్ కుమార్, జోన్ కో-ఆర్డినేటర్ స్వరూప్ కుమార్, డాక్టర్ వెచ్చా సంతోష్, ఢిల్లేశ్వర్, పవన్ పాల్గొన్నారు.


గుజరాతీపేట : వివిధ రకాల వేషధారణలతో విద్యార్థులు

సంక్రాంతి సంబరాలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని జాయ్ కిడ్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్, ఆదిత్య ఆర్ట్రీ అకాడమీలో ముందస్తు సంక్రాంతి సందర్భంగా రంగవల్లులు, భోగి మంటలు, హరిదాసు కీర్తనలతో విద్యార్థులు ప్రదర్శన ఆకట్టుకుంది. ఆదిత్య ఆర్ట్రీ అకాడమీలో క్రైమ్ ఎసిపి డి.పి.వి.రవితేజరావు, వైద్యులు ముద్దాడ చిన్నబాబు అకాడమీ డైరెక్టర్ చెటికెం రాజ్‌కుమార్, జి.వెంకటేశ్వరరావు, ఎ.శివాజీ, పి.గోవిందరావు, కృష్ణప్రసాద్, శ్రీనివాసరావు, తిరుపతిరావు, చంద్రమౌళి పాల్గొన్నారు.

గుజరాతీపేట : పి.ఎస్.ఆర్.కాలనీలోని మెహర్ విద్యా విహార్ పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, పిండి వంటలు, భోగీ పళ్ళు, రంగవల్లులు, బొమ్మల కొలువులు, గాలిపటాలు, సంక్రాంతి శోభలు, విచిత్ర వేషధారణలు, పాటలు, నృత్యాలతో సంబరాలు అంబరాన్ని అంటాయి.


కామేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యతోనే అభివృద్ధి

పలాస: విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని ఎచ్చెర్ల బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ విశ్రాంత వైస్ ఛాన్సలర్ కూన రాంజీ, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ సూర్యతేజ ఇంటర్, డిగ్రీ కళాశాల వార్షికోత్సవం, ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశలో చదువుపై దృష్టిసారిస్తే భవిష్యత్‌లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. విద్యార్థుల భవిష్యత్ అంతా ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుపై ఆధారపడి ఉంటుందన్నారు. ఏ మాత్రం తప్పటడుగు వేస్తే భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం వీరిని మదర్ థెరీసా పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని, పలాస గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్‌లు సన్మానించారు. అలాగే ధానేటి కామేశ్వరరావు, పద్మజాలకు కూడా దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు, ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో సూర్యతేజ కళాశాల చైర్మన్ దానేటి కామేశ్వరరావు, కరస్పాండెంట్ దానేటి పద్మజా, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు హాల్ట్‌లు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ళ నిలిపేందుకు రైల్వే ఉన్నతాధికారులు అంగీకారం తెలిపినట్లు వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ తెలిపారు. బుధవారం మండలంలో ముద్దాడపేటలో విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్, భువనేశ్వర్ మధ్య నడిచే పలు రైళ్లకు శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో హాల్టు సౌకర్యం కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే అంగీకారం తెలిపిందన్నారు. తూర్పు తీర రైల్వే, దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైల్వే శాఖ నడుపుతున్న పలు ప్రత్యేక రైళ్లను రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక హాల్ట్ సౌకర్యం కల్పించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ నిరంజన్ బాబు, సర్పంచ్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస : కాశీబుగ్గలో శుక్రవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పలాస విద్యుత్ శాఖ ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గలో కెటి రోడ్డు పనుల్లో భాగంగా హరిశంకర్ సినిమా హాల్, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఆంధ్రా బ్యాంకు లైన్, మహారాణిపేట, న్యూ కాలనీ, పోలీస్‌స్టేషన్, చేపల మార్కెట్, గాంధీనగర్, గున్నేశ్వర నగర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వీధి, ఆర్కే పోలీసు కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రేపు యుటిఎఫ్ నవోదయ మోడల్ పరీక్ష

సోంపేట: స్థానిక హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ మందస మండలశాఖ ఆధ్వర్యంలో నవోదయ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. ప్రకటన విడుదల చేశారు. పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల విద్యార్థులకు మోడల్ నవోదయ పరీక్ష జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ మందస మండల, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావులు తెలిపారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం


మెళియాపుట్టి : క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


టెక్కలి : కబడ్డీ కూతకు వెళ్లిన వాణి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. బుధవారం చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక ఉల్లాసానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అంతకుముందు సచివాలయ ఆవరణలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, మండల వైసిపి కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ బోసి రామారావు, కరణం శశిభూషణరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, జడ్‌పిటిసి దువ్వాడ వాణి ప్రారంభించారు. మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో 127 టీంలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఎంపిపి అట్ల సరోజనమ్మ, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, ఎంఇఒ దల్లి వీరాస్వామి రెడ్డి, ఎంపిటిసి పీత హేమలత, ఉపసర్పంచ్ గండి విశ్వశాంతి రెడ్డి, సర్పంచ్‌లు గుజ్జు మోహన్‌రెడ్డి, కె.కామేశ్వరరావు, వైసిపి నాయకులు గండి అప్పలరెడ్డి పాల్గొన్నారు.

పొందూరు: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చునని ఎంపిపి కిల్లి ఉషారాణి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆడదాం ఆంధ్ర మండలస్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటెన్ పోటీల్లో మండలంలో పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పప్పుల రమేష్ కుమార్, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఎస్ఐ లక్ష్మణరావు, వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ బండారు జై ప్రతాప్ కుమార్, ఉప సర్పంచ్ అనకాపల్లి గోవిందరావు పాల్గొన్నారు.

పలాస: క్రీడాకారులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎన్ రమేష్ నాయుడు, మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్ అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చినబడాం, మండలంలో బొడ్డపాడు, బ్రాహ్మణతర్ల, కాశీబుగ్గ క్రీడా మైదానంలో క్రికెట్, వాలీబాల్ మండలస్థాయి పోటీలను నిర్వహించారు. మండలంలో క్రికెట్ బ్రాహ్మణతర్ల, వాలీబాల్ బొడ్డపాడు, బ్యాట్మింటైన్‌లో అల్లుకోల గ్రామ యువకులు విజయం సాధించారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించారు. నౌపడ, నరసాపురం సచివాలయాల్లో క్రీడాకారులకు ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, వైస్ ఎంపిపి ప్రతినిధి రామకృష్ణ, సర్పంచ్ మార్పు అశోక్ చక్రవర్తి, పిఎసిఎస్ సభ్యులు నాగభూషన్, కోటపాడు సర్పంచ్, ఎంపిటిసి ప్రతినిధి కోత సతీష్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: అక్కుపల్లిలో ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి పోటీలను వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ ఈశ్వరమ్మ, సర్పంచ్‌లు డొంకాన విద్యాసాగర్, కొల్లి భాస్కరరావు, యువజన అధ్యక్షుడు యోగి, నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పైల గజేంద్ర, లోకేష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక సురంగి రాజా క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మున్సిపాలిటీ స్థాయి పోటీలకు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పడ రాజారెడ్డి, వైస్ ఎంపిపిలు దువ్వు వివేకానంద, దున్న గురుమూర్తి, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్‌పట్నాయక్, టౌన్ జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తంరెడ్డి, దక్కత నూకయ్య, పి.చట్టిబాబు పాల్గొన్నారు.

కవిటి: ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా కవిటి, శిలగాం వేదికల్లో బుధవారం జరిగిన క్రికెట్ పోటీల్లో మాణిక్యపురం, కవిటి-2, డి.జి.పుట్టుగ, బెలాగాం, శిలగాం, కపాసుకుద్ది జట్లు విజయం సాధించాయి. ఈ సందర్భంగా ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం యువ క్రీడాకారులను గుర్తించే కోవలో ఈ క్రీడా పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాయకులు పూడి నీలాచలం, పాండవ చంద్రశేఖర్, ఎన్ని అశోక్, ఎఒ శ్రీనివాస్‌రెడ్డి, ఇఒ వీరభద్రస్వామి, కార్యదర్శి మన్మథరావు, విఆర్ఒ నారాయణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన మండలస్థాయి పోటీలను నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి ప్రారంభించారు. ఎంపిపి కుప్పిలి ఫణీంద్రకుమార్, వైస్ ఎంపిపిలు దుక్క రోజా, రామకృష్ణ, బోయిన నాగేశ్వరరావు సర్పంచ్ కాళ్ల సంజీవరావు పాల్గొన్నారు.


పొందూరు : కబడ్డీ పోటీల్లో పాల్గొన్న యువత


నౌపడ : పోటీలను ప్రారంభిస్తున్న కృపారాణి


ఇచ్ఛాపురం : పోటీలను ప్రారంభిస్తున్న సాయిరాజ్

నందిగాం : క్రీడాకారులు పోటీతత్వంతో మెలిగి ఉన్నత విజయాలు సాధించాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రికెట్ పోటీలను ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తితో కలిసి ప్రారంభించారు. సర్పంచ్ జడ్యాడ జయరాం, ఎంపిటిసి అంబోడి విష్ణు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిడిఒ రాజారావు పాల్గొన్నారు.

క్రీడాకారుల కొట్లాట

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు వివాదాలకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం ప్రారంభమైన మండలస్థాయి క్రీడా పోటీల్లో కబడ్డి క్రీడాకారులు కొట్టుకోవడం పలువురిని విస్మయానికి గురిచేసింది. క్రీడా పోటీలు ప్రారంభం అనంతరం రావివలస, పెద్దసాన జట్ల మధ్య కబడ్డి పోటీలు ప్రారంభమయ్యాయి. రావివలస జట్టు విజయం సాధిస్తున్న క్రమంలో ఆ జట్టులో ఉన్న ఒక క్రీడాకారుడుని పెద్దసాన జట్టు క్రీడాకారులు అనిచి వేయడం తట్టుకోలేని క్రీడాకారుడు జట్టులోని ఒక వ్యక్తిపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. అయితే తాను క్రీడల్లో భాగంగా పాల్గొన్నా కానీ ఉద్దేశ్య పూర్వకంకాదని చెప్పినప్పటికీ ఇరువర్గాలు బాహాబాయికి తలపడ్డాయి. వివాదం ముదురుతుండడంతో అక్కడే ఉన్న కొందరు టెక్కలి పోలీసులకు సమాచారం అందజేయడంతో ఎస్ఐ రమేష్ సిబ్బందితో చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించినా క్రీడాకారులు పోలీసులు మాట వినకపోవడంతో ఇరువర్గాలని చెదరగొట్టారు. వివాదంపై టెక్కలి డిఎస్‌పి బాలచంద్ర రెడ్డి, సిఐ సూర్యచంద్రమౌళి ద్వారా ఆరా తీశారు. ఇరువర్గాలను చర్చలకు పిలిచే నేపథ్యంలో కొందరు వైసిపి నాయకులు జోక్యం చేసుకొని తమ పరిధిలోనే సమస్య పరిష్కరించుకుంటామని చెప్పడం గమనార్హం. క్రీడాకారులు కొట్లాటకి దిగడం పోలీసులు చదరగొట్టడంతో మైదానంలో మిగిలిన క్రీడాకారులు ఆందోళనకు గురయ్యారు. గురువారం నిర్వహించనున్న పోటీల్లో పోలీస్ బందోబస్తు లేకుండా పోటీలు నిర్వహించలేమని నిర్వాహక సిబ్బంది తెలియజేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న కృష్ణమూర్తి పక్కన రామకృష్ణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తితో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులకు సంఘీబావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యలు గాలి కొదిలేసి ముఖ్యమంత్రి తన బాధ్యతలను విస్మరించారని విమర్శించారు. న్యాయం చేయాలని అడిగితే ఎస్మా చట్టం, ఉద్యోగులపై పోలీసుల దౌర్జన్యం, ప్రశ్నిస్తే కేసులు పెట్టడమేనా మీ పాలనలో జరిగేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అరుగులు గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు చాపర సుందర్‌లాల్, యూనియన్ నాయకులు కళ్యాణ రాజు, ఎ.శంకరరావు, అర్జీ రాము, ఎ.రాజేష్, టి.వెంకటలక్ష్మి, టి.మల్లమ్మ, జె.మాధవి, ఎ.మోహన్, డి.యుగంధర్, ఎం.నారాయణరావు, ఎం.అప్పన్న పాల్గొన్నారు.

ఆమదాలవలస: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక నాయకుడు తాడి సంతోష్ అన్నారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె 16వ రోజుకు చేరుకున్న సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు, పాదయాత్రలోనూ మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరిని ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో రెగ్యులర్ చేసి సమాన పనికి సమానం వేతనం చెల్లిస్తామన్నారని, నేటికీ అమలు చేయలేదని అన్నారు. పారిశుధ్య కార్మికులు కె.తారకేశ్వరావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఎన్నికల ముందు పారిశుద్ధ్య కార్మికులు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పడం దారుణమని పారిశుద్ధ్య కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులు సమ్మె 15వ రోజుకు చేరింది. పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు


ఆమదాలవలస : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు


పలాస : దీక్ష చేస్తున్న కార్మికులు

పలాస: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు బుధవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం 16వ రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, శ్రీనివాస రావు, యూనియన్ నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మురగన్, ఎం.రవి, నాయకులు దివాకర్, ఎస్.శంకర్, తిరుపతి, ప్రకాష్ ముఖి, సీతమ్మ, గులాబీ, లక్ష్మి పాల్గొన్నారు.

యువకునికి గాయాలు


గాయపడిన ప్రవీణ్

కోటబొమ్మాళి: జాతీయ రహదారి జర్జంగి ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేటకు చెందిన వి.ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రవీణ్ మహీంద్రా ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ విధి నిర్వహణలో నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్తున్నాడు. జర్జంగి దాటిన తర్వాత ఫోన్‌లో ఫోన్ మాట్లాడుతూ వెళ్తున్నాడు. ఈ సమయంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభానికి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ప్రవీణ్‌కు ఎడమ కాలు విరిగిపోంది. వెంటనే స్థానికులు 108లో కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబుకు బెయిల్‌పై హర్షం


గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు హైకోర్టు అన్ని కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయడంపై సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో ఉన్న ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అధికారం చేతి ఉందని సిఎం జగన్ చంద్రబాబును వేధింపులకు గురి చేసేందుకు చేసిన కుట్రలను తలకిందులు చేస్తూ మూడు కేసుల్లో హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిందన్నారు. ఆధారాలు లేకపోయినా సిఐడి అధికారులను అడ్డం పెట్టుకుని అక్రమ కేసులు పెట్టారని విమర్శించారు. దీంతో న్యాయం నిలకడ మీద రుజువైందన్నారు. ఐఆర్‌ఆర్, మద్యం కేసు, ఇసుక కేసుల్లో ఒకేసారి బెయిల్ రావడం శుభపరిణామన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మధు

విఆర్ గూడెంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- పొందూరు

మండలం విఆర్.గూడెం గ్రామంలో సర్పంచ్ సువ్వారి అమ్మాయమ్మ ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో మురుగు కాలువలు, రహదారుల పక్కన పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారాలను తొలగించి శుభ్రపరిచారు. సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు, ఉపసర్పంచ్ ప్రతినిధి గోవిందరావు, వార్డు మెంబర్స్, సచివాలయ కార్యదర్శి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం


మెమోంటోతో విద్యాసాగర్

టెక్కలి రూరల్: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో జిల్లాకు చెందిన హోమియో వైద్యులు డా.నంబాళ్ల విద్యాసాగర్‌కు స్థానం లభించింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన యువ జనోత్సవం-యువ 2024లో భాగంగా పాల్గొన్న విద్యాసాగర్ 'ఫుడ్ ఆస్ మెడిసిన్- ఎ హోమియోపతిక్ పెర్స్ పెక్టీవ్' అంశంపై ప్రసంగించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన యువ 2024లో ప్రతిష్టాత్మకమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సంపాదించారు.

ఉత్కంఠభరితంగా క్రికెట్ పోటీలు

కవిటి: మండలం డి.గొనపపుట్టుగ గ్రామంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. శ్రీప్రతిభ యువజన సంఘ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో బుధవారం కేశపురం జట్టుపై కొమ్ముపుట్టుగ, సన్యాసిపుట్టుగ జట్టుపై బైరెడ్లపుట్టుగ, బలరాంపురం జట్టుపై కరాపాడు, కన్నుపుట్టుగ జట్టుపై బెజ్జిపద్ర విజయం సాధించాయి.

మండలస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

స్వామి వివేకానంద 160వ జయంతి ఉత్సవాల సందర్భంగా మండలం ధర్మవరం గ్రామంలో ఈ నెల 11, 12 తేదీల్లో మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించబడునని నిర్వహణకమిటీ ప్రతినిధి టేకి ఆచారి ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల జట్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ. 3వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల జట్లు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, క్రీడాకారులకు మధ్యాహ్నం వసతి కల్పించబడునని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎస్.సూర్యనారాయణ 9515063079, ఎస్.సురేష్ 6301689130 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు


చట్టాలపై ప్రభుత్వానికి స్పష్టత కరువు


మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వానికి చట్టాలంటే గౌరవం లేదని, అలాగని చట్టసభల్లో చట్టాలపై తీసుకున్న నిర్ణయాల్లో స్పష్టత లేకుండా పోయిందని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ ఆరోపించారు. అరసవల్లిలోని ఆయన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పెద్దఎత్తున సమగ్ర సర్వే చేపడుతున్నట్టు హడావుడి చేసిన ప్రభుత్వం ల్యాండ్ టైటలింగ్ యాక్టులో స్పష్టత ఇవ్వలేకపోతున్నారని అన్నారు.. స్వయానా రెవెన్యూ శాఖకు ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రస్తుతానికి ఈ చట్టం అమలులో ఎటువంటి చర్యలు తీసుకోమని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. ఈ యాక్టు అమలు కోసం ఇప్పటికే రూ.కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం చట్టం అమలుపై చిత్తశుద్ధిని కోల్పోయిందన్నారు.

లింగన్న మృతి తీరని లోటు


మాట్లాడుతున్న మాజీ మంత్రి శివాజీ

ప్రజాశక్తి- సోంపేట

గొల్లవూరు మాజీ సర్పంచ్ కర్రి లింగన్న మృతి పంచాయతీ అభివృద్ధికి తీరనిలోటని, ఆయన చేసిన సేవలు అందరికీ ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. గ్రామంలో బుధవారం లింగన్న సంతాప సభ కుటుంబసభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ, నాయకులు జికె నాయుడు, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, పైడి పట్టాభి రామారావు, బట్టి మాధవరావు, గౌతు విజయలక్ష్మి, దివాకర్ కామేశ్వరరావు, బి.మోహనరావు, తాతారావుతో పాటు యాదవకుల సంఘ నాయకులు పాల్గొని మాట్లాడారు. కల్లూరు పంచాయతీ అభివృద్ధికి లింగన్న చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో బిసిలపై కేసులు

ప్రజాశక్తి- పలాస

జగన్ పాలనలో బిసిలపై దాడులు చేస్తూ తిరిగి కేసులు పెడుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. మండలంలో కొత్తవూరు గ్రామంలో బుధవారం జయహో బిసిసభ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైసిపి నుంచి టిడిపిలో చేరిన వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో బిసిలకు న్యాయం చేశామని చెప్పుకుంటున్న జగన్ అన్ని ప్రాంతాల్లో రెడ్డిలకు పెద్దపీట వేస్తూ బిసి మంత్రులు, బిసి నాయకులతో పల్లకి మోయిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 62 శాతం బిసిలు ఉంటే టిడిపి హయాంలో 34శాతం రిజర్వేషన్లు చంద్రబాబు నాయుడు కల్పించారన్నారు. బిసికి చెందిన 30 పథకాలకుపైగా వైసిపి ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బిసిలంతా టిడిపి వైపే వస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జయహో బిసి పరిశీలకులు బోర గోవిందరావు, కుత్తుం లక్ష్మణరావు, దువ్వాడ సంతోష్, పిరికట్ల విఠల్‌రావు, లోడగల కామేశ్వరరావు, గోళ్ళ చంద్రరావు, తమ్మినేని గంగారాం, సంతోష్ పండా, నెయ్యిల వసంతరావు, వంకల కూర్మారావు, గోవింద పాపారావు, షణ్ముఖరావు పాల్గొన్నారు.


టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గౌతు శిరీష

హోరాహోరీగా ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి- పలాస

పలాస జూనియర్ కళాశాల క్రీడామైదానంలో జరుగుతున్న 47వ జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో బుధవారం పురుష, మహిళా క్రీడాకారులు హోరాహోరీగా పాల్గొని తమ సత్తాను చాటారు. మొదటి రోజు టెన్నికాయిట్ చాంఫియన్ షిప్ పోటీల్లో హర్యానాపై పోటీకి దిగిన ఒడిస్సా జట్టు విజయం సాధించింది. అలాగే ఢిల్లీ జట్టుపై మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌పై తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్‌పై పాండిచ్చేరి జట్టు విజయం సాధించింది. అలాగే గుజరాత్‌పై ఆంధ్రప్రదేశ్ జట్టు, అస్సాంపై జార్కాండ్ జట్టు, జమ్ముకాశ్మీర్‌పై తమిళనాడు జట్టు విజయం సాధించింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఫ్లెడ్‌లైట్లు వెలుగుల్లో జరిగిన ఈ పోటీలు రసవత్రంగా సాగాయి. ఈ పోటీల్లో టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు వై.డి. రామారావు, రాష్ట్ర కార్యదర్శి కెఎన్‌వి సత్యన్నారాయణ, రాష్ట్ర కోశాధికారి పి.తవిటయ్య, జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, రాష్ట్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ముఖ్య సలహాదారులు వి.సుందరరావులు పర్యవేక్షించగా స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, హరిబాబు, డి.రామారావు, పద్మలోచనలతో పాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులచే క్రీడలను ఆడించారు.


ఆటలు ఆడుతున్న క్రీడాకారులు

మోకాళ్లపై నిల్చొని నిరసన


మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న బెంతు ఒరియా ప్రతినిధులు

ప్రజాశక్తి- కవిటి

తమజాతి గుర్తింపు, తమ భవిష్యత్ భరోసా కోసం పోరాడుతున్న బెంతు ఒరియాలు బుధవారం మోకాళ్లపై నిలబడి తమ నిరసన తెలిపారు. బస్టాండ్‌లో చేస్తున్న ఈ రిలే నిరాహారదీక్షలు 14వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా బుధవారం దీక్షలో నెలవంక గ్రామానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమజాతికి గుర్తింపు లభించే వరకు, తమబిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కృష్ణ బిసాయి, మేఘనాధ్ బిసాయి, దయానిధి, ఢిల్లీమోహన్, హరికృష్ణ బిసాయి, సత్యనారాయణ, జయసేన్ బిసాయి, గోపి బిసాయి, గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

భారత దేశంలో ఏ రాష్ట్ర సిఎం చేయలేని విధంగా నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారని మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండెలి సుజాత అన్నారు. బుధవారం అంబేద్కర్ కూడలి వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో 125 అడుగుల ఎత్తుతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ 9 నుంచి 18 వరకు పెద్ద పండగ వాతావరణంలో సామాజిక, న్యాయ మహాశిల్పి కార్యక్రమం పేరుతో గ్రామస్థాయిలో, మండల స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చింతాడ గణపతిరావు, బసవల ధనుంజయరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

ఇచ్ఛాపురం : ప్రభుత్వం అందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ కోరారు. పట్టణంలోని తురకవీధి వార్డు సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వార్డు కౌన్సిలర్ పరపటి మంజులతరెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్‌పట్నాయక్, జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, పరపతి కోటి, నీలాపు ఢిల్లీ, ఉప్పాడ రాజారెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

యోగాసనంలో మూర్తి ప్రతిభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విశాఖ నగరంలోని బీచ్ రోడ్‌లోని గాదిరాజు ప్యాలెస్‌లో మంగళవారం నిర్వహించిన యోగాసనలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వ్యాయామ అధ్యాపకులు కె.వి.ఎన్.మూర్తి ఓం ఫ్రీ యోగ సంస్థ వరల్డ్ రికార్డ్ నమోదులో చోటు దక్కింది. నిరంతరాయంగా 88 నిమిషాల్లో 2,592 ఆసనాలు వేసి యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, రాజమండ్రి, ఏలూరు తదితర ప్రాంతాల నుంచి 270 మంది యోగా అభ్యాసకులు పాల్గొన్నారు. మూర్తికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- సంత బొమ్మాళి

సంతబొమ్మాళి మండలం బోరుభద్ర- డీపీఎన్ రహదారి పాలతలగాం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఎస్బీకొత్తూరు గ్రామానికి చెందిన వంకలనవీన్, సార శ్రీను ఇద్దరు యువకులు ఆడుదాం ఆంధ్ర వెళ్లి బోరుభద్ర నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనం వైపు వెళ్తున్నారు. అదేమార్గంలో పొలంలో నుండి ధాన్యం లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను వీరు ద్విచక్ర వాహనంతో బలంగా ఢీకొనడంతో నవీన్, శ్రీనులకు కాళ్ల, తలపై తీవ్రంగా గాయలుపాలయ్యాయి. దీంతో స్థానికులు సహాయంతో వీరిని శ్రీకాకుళంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నవీన్ పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. డిఎన్ రోడ్‌లో జంగిల్ ఎక్కువగా ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. తరుచూ ఈ రోడ్డుపై ప్రమాదాలు జరిగినప్పటికీ అర్‌అండ్‌బి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సంతబొమ్మాళి ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు.

పెయింటింగ్ పోటీలో విద్యార్థి ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్ఎస్ఎస్ జాతీయ సమగ్రత శిబిరం చతీష్‌ఘడ్ రాష్ట్రం దుర్గ్‌లో జరిగిన పెయింటింగ్ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ పురుషుల కళాశాల విద్యార్థి ఈశ్వరసాయి పాల్గొని ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఈ శిబిరంలో 14 విశ్వవిద్యాలయాల పరిధిలో ఉన్న కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. దుర్గ్ జిల్లా కేంద్రంలో ఉన్న హేమచంద్ యాదవ్ యూనివర్సిటీ లో ఈ నెల 2 నుంచి 8 వరకు ఈ జాతీయ సమగ్రత శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీకాకుళం పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు హాజరయ్యారు. థర్డ్ బిబిఎ చదువుతున్న ఈశ్వరసాయి జాతీయస్థాయిలో పెయింటింగ్‌లో ద్వితీయ స్థానం దక్కించుకున్నట్లు ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ సురేఖ, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా 'సంక్రాంతి లక్ష్మి'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్వీన్ ఈవెంట్ ఆర్గనైజర్లు ఎం.ఉషారాణి, టి.ఉషారాణి ఆధ్వర్యాన అరసవల్లిలోని ఎల్ఎన్ గ్రీన్ ఫంక్షన్ హాల్లో సంక్రాంతి లక్ష్మి వేడుకలు బుధవారం నిర్వహించారు. మిసెస్ విశాఖ క్వీన్ విన్నర్ దివ్యమచ్చ, మిసెస్ క్వీన్ ఆఫ్ వైజాగ్ స్వాతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్య క్రమానికి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, సిందూర ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సిందూర, జిఎన్‌వి మేనేజింగ్ పార్టనర్లు సుజాత, నిర్మలాకుమారి, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలోని



పోటీలను ప్రారంభిస్తున్న లక్ష్మీదేవి

మహిళలు, బాలికలు, వివిధ శాస్త్రీయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. సంక్రాంతి లక్ష్మీ పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతి అందజేశారు. ఈ ఈవెంట్‌కు విధ పోటీలకు 50 మంది పాల్గొనగా, 20 మందిని ఎంపిక చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులను పంపిణీ చేస్తున్న లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనో వికాస కేంద్రంలో టిడిపి నాయకులు మణికంఠ జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొని నిత్యావసర సరకులను అందజేశారు. మానసిక అంగ వైకల్యం ఉన్న వారికి అండగా నిలవాలన్న మణికంఠ ఆలోచనను ఆమె అభినందించారు. కార్యక్రమంలో టిడిపి దేవాంగుల సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు గుత్తు చిన్నారావు, డివిజన్ ఇన్‌ఛార్జి డాక్టర్ శివప్రసాద్, కోల శ్రీనివాస్‌దేవ్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి మెండ గిరీష్ ప్రతాప్, అరసవిల్లి యూత్ కునుకు గోవింద పాల్గొన్నారు.

ఇసిసిఇలో దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీలో ఇసిసిఇలో ఆరు నెలల వ్యవధి గల సర్టిఫికెట్ కోర్సులో దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని పెంచినట్లు వర్శిటి రిజిస్ట్రార్ బి.అడ్డయ్య తెలిపారు. ఈ నెల 10తో ముగిసిన గడువు తేదీని జనవరి 24 వరకు పొడిగించడం జరిగిందని తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశం పొందేందుకు అర్హతలు, సిలబస్, దరఖాస్తు చేసుకునే విధానం తదితర వివరాల కోసం www.brau.edu.in వెబ్ సైట్‌ను చూడవచ్చునన్నారు. అర్హతగల వారు రూ.250 రిజిస్ట్రేషన్ ఫీజుగా అన్‌లైన్ ద్వారా యూనివర్శిటీకు చెల్లించాలని సూచించారు.

చంద్రబాబును కలిసిన ఎంజిఆర్

ప్రజాశక్తి- పాతపట్నం

విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గంలో జరుగుతున్న రా కదలిరా "చంద్రగర్జన 'బహిరంగ సభకు విచ్చేసిన టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడును సామాజిక వేత్త మామిడి గోవిందరావు సభావేదికపై పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు.



చంద్రబాబును సన్మానిస్తున్న ఎంజిఆర్

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రేగిడి: బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎపిజివిబి రీజనల్ మేనేజర్ బి రాఘవేంద్ర అన్నారు. బుధవారం బ్యాంకు మేనేజర్ పొన్నాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో నూతన ఎపిజివిబి భవనాన్ని ఉంగరాడ రోడ్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం రీజియన్ బిజినెస్ మేనేజర్ సోమేశ్వరరావు, ఉంగరాడ సర్పంచ్ శోభారాణి, అకౌంటెంట్ ఈశ్వరరావు, కింజరాపు మధుసూదన్ రావు నాయుడు, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టంలో ట్రాఫిక్ జామ్

వీరఘట్టం: మండల కేంద్రంలో తెలగ వీధి జంక్షన్ వద్ద పాలకొండ నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న భారీ వాహనం బుధవారం డివైడర్‌ను ఢీకొంది. దీంతో వాహనం ముందు భాగం దెబ్బతినడంతో మార్గం మధ్యలో నిలిచిపోయింది. రోడ్డుకు అటు, ఇటు వాహనాలు వెళ్లేందుకు వీల్లేకపోవడం తో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

విద్యార్థినికి అభినందన

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థిని మెండ ఈశ్వరి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో పిఒగా ఎంపికవ్వడంతో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ బుధవారం అభినందించారు. కోటబొమ్మాళి మండలం దంత గ్రామానికి చెందిన ఈశ్వరి తండ్రి జోగారావు మధ్యతరగతి కుటుంబానికి చెందిన వారు కావడంతో ఈశ్వరి బ్యాంకు పిఒగా ఎంపికకావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈశ్వరిని అభినంధించిన వారిలో ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, రామారావు, కందొగొల్ల ఉన్నారు.

జగనన్న పాలన స్వర్ణయుగం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జగనన్న పాలన చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిపోతుందని పెద్దబొడ్డపాడు మాజీ సర్పంచ్, సచివాలయ కన్వీనర్ ఉప్పాడ ఆనందరావు అన్నారు. వైఎస్ఆర్ పింఛన్ రూ.3 వేలుకు పెంచిన సందర్భంగా బుధవారం గ్రామంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ రూ.3 వేలకు పెంచారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుంపల గోవిందరావు, ఉప్పాడ సింహాచలం, దుంపల ప్రభాకరరావు, వాలంటీర్ తమ్మినాన శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కరస్పాండెంట్ ప్రసాదరావు

ఎస్‌విజెలో క్యాంపస్ ఎంపికలు

ప్రజాశక్తి- కవిటి

స్థానిక ఎస్‌విజె విద్యాసంస్థల్లో గత శుక్రవారం జరిగిన ప్రాంగణ నియామకాల్లో 32 మంది ఎంపికైనట్లు కరస్పాండెంట్ బివివి ప్రసాదరావు తెలిపారు. అనంతపురంలో సుజలాన్ ఎనర్జీ కంపెనీ తరుపున హెచ్‌ఆర్ అనిమేష్ భట్టాచార్య తుది ఫలితాలు వెల్లడించినట్లు ఆయన తెలిపారు. ఎస్‌విజె ఐటిఐ విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ఎంపికైన అభ్యర్థులకు బుధవారం సంస్థ ప్రవేశపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్ర పాత్రో పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి శిరీష పరామర్శ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పెద్దబొడ్డపాడు గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి కార్యకర్త దుంపల ముఖలింగం తల్లి అమ్మన్న ఇటీవల మృతి చెందారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, మండల టిడిపి అధ్యక్షుడు సూరాడ మోహనరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కణితి సురేష్, మాజీ అధ్యక్షుడు గోవింద పాపారావు, మీడియా ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి చిట్టిబాబు, మణిగాం తాతయ్య, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న శిరీష